కథ

# ఆమె కథ

– స్వామి చిత్రానంద

"అదేమిటమ్మా- ఆ ఫోటోలో ఉన్న మగవాని ముఖానికి మాత్రం నలుపురంగు పూశారు? ఆ మొహం మీంచి ఒకే ఒక మంగళసూత్రం వేలాడదీశారు?" అని ఆశ్చర్యంగా అడిగాడు పెళ్ళిళ్ళ పేరయ్య.

హాలులో ఆయనతో పెళ్ళిమాటలు మాట్లాడిన ఆ యింటి యజమానురాలు - (ఆ ఫోటోలో ఉన్న స్త్రీమూర్తి ఆమెదే! కాని, అది సుమారు పాతికేళ్ళ క్రితం తీసినది!)

"నా వివరాలు ఏవీ తెలుసుకోకుండానే, మా అబ్బాయికి సంబంధం తీసుకువచ్చారా?" అని అడిగింది.

"మగ పిల్లవాడి వివరాలు ఎవరడుగుతున్నారమ్మా? అసలు- పెళ్ళి కావలసిన అబ్బాయి దొరకడమే కష్టంగా ఉంది. నేను ఏదో 'పరోపకారార్థం ఇదమ్ శరీరం' అన్నారని అలా అలా ఆఫీసుల వెంట తిరిగి, పెళ్ళి కాని- అదే పెళ్ళి కావలసిన అబ్బాయిల వివరాలు సేకరించి, ఏదో యథాశక్తి సంబంధాలు కుదురుస్తున్నాను-"

"చాలా సంతోషం- మీరింత వరకూ ఎన్ని పెళ్ళిళ్ళు చేయించారు?"

"ఉంటాయండి- దగ్గర దగ్గర వేయి అవబోతున్నాయండి- రేపు ఉగాదికి వెయ్యి పూర్తవుతాయని అంచనా. మా అఖిలాంధ్ర వివాహ సంధానకర్తల సంఘం నాకు సన్మానం తలపెట్టింది కూడా-" అన్నాడు గర్వంగా.

"మా అబ్బాయి- అదే నాకు ఒకే ఒక కొడుకు. వాడిపైన నలుగురు అమ్మాయిలు, అందరికీ పెళ్ళిళ్ళయి కాపరాలు చేసుకుంటున్నారు. ఇక, వీడి పెళ్ళి. వీడి ఇష్టం. ఎప్పుడు చేసుకుంటానంటే అప్పుడు, ఎవర్ని చేసుకుంటానంటే వారిని- అందులో నా ప్రమేయం వుండదు. పెళ్ళి మాత్రం నేను అనుకున్నట్లు జరగాలి"

"అలాగేనమ్మా- నేను చెప్పబోయే అయిదారు సంబంధాలూ, కట్నకానుకల్లో గాని, లాంఛనాల్లో గాని, పెళ్ళి జరిపించడంలో గాని మీకు ఎదురు చెప్పరు. నేను చెప్పనీయను" అన్నాడు చాలా ధీమాగా.

"అది సరే - ముందు, అబ్బాయీ, అమ్మాయీ ఒకరికొకరు నచ్చాలి. ఆ తర్వాతనే మిగతావి" అంది ఆమె కూడా ధీమాగానే.

"చాలా సంతోషమమ్మా- అలా చెప్పే మగపెళ్ళి వారెక్కడున్నారమ్మా ఈ రోజుల్లో! అయితే, పెళ్ళిచూపులకు ఏర్పాటు చేద్దాం"

"దానికన్నా ముందు, నా గురించీ, నా గత చరిత్ర గురించీ, ఆ కన్యాదాతకు తెలియాలి. వారు మాతో వియ్యమందడానికి అంగీకరిస్తేనే, అప్పుడు పెళ్ళిచూపులు-"

"చాలా సంతోషమమ్మా- చెప్పండి మీ గురించి- మీ దగ్గర విన్నదంతా పూసగుచ్చినట్టు వారికి చెబుతాను" అన్నాడు పేరయ్య.

"నా గురించి నేను చెప్పడం కాదు. నే చెప్పేదాంట్లో అసత్యాలు ఉండొచ్చు. అంచేత, నాతో వియ్యమందిన వారిలో ఒకరు- ఈ ఊళ్ళోనే వున్నారు. అదే మా పెద్దమ్మాయి మావగారు- మీరు వారిని అడగండి- వారు చెబుతారు," అని వియ్యంకుడి పేరూ, ఎడ్రసూ ఇచ్చింది.

పేరయ్యకు ఆమె ప్రవర్తన చాలా ఆశ్చర్యంగా తోచింది.

ఆ చిరునామా తీసుకుని వెళ్ళాడు. ఆ వీరరాఘవయ్య గారిని కలిసి, విషయం చెప్పి, వారికి వీలుగా ఉండే రోజున- చెప్పిన టైమ్‌కి వస్తానన్నాడు.

"అక్కర్లేదు, నాకు ఇప్పుడు తీరుబడే- మీక్కూడా తీరుబడి అయితే, ఇప్పుడే కూచోవచ్చు-" అని ఆయన్ను వేరే గదిలోకి తీసుకువెళ్ళి, కాఫీ ఇచ్చి, 'ఆమె కథ' చెప్పడం ప్రారంభించారు.

"ఆమె నా వియ్యపురాలు అని చెప్పడం కాదండి, అటువంటి స్త్రీపాత్రను మనం ఏదన్నా నవలలో గాని, కథలో గానీ చదివితే - ఇదంతా రచయిత ఊహ, కల్పన అంటాం. అయినా ఇలాంటి మనుషులుంటారా అని అనుమానిస్తాం. కాని- భర్త వదిలిపెట్టిన తరువాత, ఆమె పాతిక సంవత్సరాలకు పైగా ఒంటరిగా బతుకుతూ, పిల్లల్ని పెంచి పెద్ద చేసి, వాళ్ళ బతుకులు వాళ్ళు బతగ్గలిగే స్థితికి తీసుకువచ్చింది. అది అదృష్టం అని అంతా అంటారు. కాని నేను మాత్రం అది ఆమె దీక్షకి, పట్టుదలకీ నిదర్శనం అంటాను," అన్నారు వీరరాఘవయ్యగారు.

"ఇంకొంచెం వివరంగా చెబుతారా?" ఆత్రుతగా అడిగాడు పేరయ్య.

"చెబుతా, కాని మీరు శ్రద్ధగా వినాలి. ఆమెకు చాలా చిన్నవయసులోనే పెళ్ళయింది. పెళ్ళయిన రెండేళ్లకి ఆమె కాపరానికి వచ్చింది. తొలిచూలు ఆడపిల్ల పుట్టింది. అంతా మహాలక్ష్మి పుట్టిందన్నారు. నిజంగానే మహాలక్ష్మి అని పేరు పెట్టారు. ఆమే మా ఇంటి మహాలక్ష్మి" అని లోపలికి చూసి-

"అమ్మా! మహాలక్ష్మీ!" అని పిలిచారు.

"పిలిచారా, మామయ్యా?" అంటూ ఆమె వచ్చి, గుమ్మం అవతలనే నిలబడింది.

"ఈయన మీ తమ్ముడికి సంబంధం తీసుకువచ్చారు. వారికి నిన్ను చూపిద్దామని-" అన్నారు.

"నమస్కారం అండి-" అని నమస్కారం చేసింది మహాలక్ష్మి.

"ఆయుష్మాన్ భవ!" అని దీవించాడు పేరయ్య.

"నువ్వు లోపలకు వెళ్ళమ్మా" అన్నారు వీరరాఘవయ్యగారు. మళ్ళీ కథ ప్రారంభించారు.

"ఈమె తర్వాత మరో ముగ్గురు ఆడపిల్లలు- మగపిల్లాడు పుట్టాలి, వంశోద్ధారకుడు కావాలి అన్న భర్త మాటకి ఎదురు చెప్పలేక పోయింది ఆమె. అయిదో కాన్పులో మగపిల్లాడు కలిగాడు. ఆమెకు బాగా సుస్తీ చేసింది. తల్లి ప్రాణం దక్కదనుకున్నారు. అదృష్టం బాగుండి తల్లీ బిడ్డా కులాసాగా బయటపడ్డారు. కాని, ఆమె ఆరోగ్యం అంతంత మాత్రంగానే వుంటుందనీ, సంసార సుఖానికి పనికిరాదనీ డాక్టర్లు చెప్పారు.

'నాకీ అదృష్టం చాలు' అనుకుంది ఆ ఇల్లాలు. కాని, ఆమె భర్త అలా అనుకోలేదు. ఆమె ఆస్పత్రిలో ఉండగానే, ఆయనకి ఓ నర్స్‌తో పరిచయం ఏర్పడింది. ముసిముసి నవ్వులూ, పరాచికాలూ, పకపకలూ అవీ మొదలయ్యాయి. చూసినవాళ్ళు ఆయన వరసే అంత, అందరితోనూ అలాగే కొంచెం ఎక్కువ చనువుగా వుంటాడనుకున్నారు. ఆ చనువు అలా పెరిగి పెరిగి ప్రేమలో పడింది. ఒకర్ని వదిలి ఒకరు ఉండలేని పరిస్థితి. ఆమె హాస్పిటల్‌కి వెళ్ళినా, ఈయన మాత్రం ఆమె ఇంట్లో 'ఇన్ పేషెంట్'గా ఉండేవాడు. రాత్రులు అసలు ఇంటికి వచ్చేవాడే కాదు. ఆయన పరిస్థితిని మార్చాలని చాలామంది బంధువులు చాలా రకాలుగా ప్రయత్నించారు. ఏమీ ప్రయోజనం లేకపోయింది."

పేరయ్య శ్రద్ధగా చెవులు అప్పగించి వింటున్నాడు.

"ఆమె భర్త మాత్రం- 'మీ చావు మీరు చావండి' అని ఆయన ఈ కుటుంబంతో తెగతెంపులు చేసుకుని, ఆ నర్స్‌తో బంధం పెంచుకున్నాడు. ఆ నర్స్ పెళ్ళికి అంగీకరించలేదు. పెళ్ళి ఆమె వృత్తికి అడ్డం అనుకుందో ఏమో మరి-?

"ఈమె ఒంటరిగా పిల్లల్ని పెట్టుకుని వుంటోంది. బంధువులు కూడా రాకపోకలు తగ్గించేశారు. ఆమె, పాపం- అలాగే ఆ యింటిమీద వచ్చే అద్దెతో పాటు- ఏదో టేలరింగూ, బొమ్మలు తయారు చేయడాలలాంటి పనులు చేసి, కాస్తో, కూస్తో సంపాదిస్తూ, అందరినీ పెంచి పెద్దచేసింది. అందరికీ వుద్యోగాలు దొరికాయి. వాళ్లకి అలాంటి చదువులు చెప్పించింది. మా కోడలు ఒక పెద్ద ఫారిన్ కంపెనీలో స్టెనో. అలాగే మిగతా వాళ్లు కూడా. వాళ్లంతా వాళ్ల వాళ్ల కాళ్ళ మీద నిలబడగలిగే స్తోమత సంపాదించి పెట్టింది ఆమె. ఎప్పుడేనా, పండగలకైనా, ఇంటికి వచ్చి పిల్లల్ని చూడమని కబురు చేసేది భర్తకి - ఆయన ఏనాడూ రాలేదు. ఆమెలో వున్న ప్రేమ ద్వేషంగా మారింది. చివరకు పగ అయింది. 'నాకు భర్తలేదు' అని చెప్పుకునే స్థితికి వచ్చింది. ఆ స్థితికి తెచ్చింది ఆమె భర్తే! అందుకే

ఆమె మెడలో ఆయన కట్టిన మంగళ సూత్రాన్ని తీసేసి ఆ ఫోటోకి తగిలించింది. పుట్టింటి వారి మంగళసూత్రం మాత్రం ఆమె మెడలోనే వుంది. ఆమె దృష్టిలో భర్త లేడనే! అందుకే ఆ ఫోటోలో వున్న ఆయన ముఖానికి నలుపు రంగు పూసింది. ఆమెకు జరిగిన 'అన్యాయం' అందరికీ తెలియాలీ, ఆ అన్యాయాన్ని ఆమె ఎలా ఎదుర్కొన్నదీ అందరికీ చెప్పాలనే అలాచేసింది, ఆమె ధైర్యాన్ని నేను మెచ్చుకున్నాను. 'నా ఖర్మ ఇలాకాలింది- ఆయనకేం మగ మహారాజు' అని ఇంట్లోనే తలుపులు మూసుకుని ఏడవకుండా, తన జీవిత మార్గాన్ని తనే మార్చుకుంది. ఇలాంటి మనిషి తారసపడి వుండదు." అని అభినందన పూర్వకంగా ఆమె కథను ఆయన ముగించారు.

"ఆవునండి, ఇలాటిదేదన్నా వున్నా, నిజం ఎవరు చెబుతారండీ? 'మా వారు వూరికి వెళ్ళారు. వస్తార్లెండి' - అని మభ్యపెట్టి, పెళ్లిళ్లు జరిపించేస్తారు. ఆమె ధైర్యానికి ఆమెను అభినందించాలి, మంచి సంబంధం నేను తీసుకు వస్తాను. ఆమె చెప్పిన కండిషన్స్‌కి నేను వాళ్లని ఒప్పిస్తాను" అన్నాడు పేరయ్య పెళ్లి జరిపించేస్తున్నంత ఆనందంలో.

"వాటికన్న ముఖ్యం - అబ్బాయి, అమ్మాయీ ఒకర్ని ఒకరు చూడ్డం - ఒకరికొకరు నచ్చడం - ఆ మాట మీకు ఆమెగారు చెప్పి వుండాలే!"

"చెప్పారండి, నేను ఏర్పాటు చేస్తానుగా!" అని లేచి లోపలకు ఓ సారి తొంగి చూసి -

"అమ్మా! మహాలక్ష్మీ! సెలవమ్మా - త్వరలోనే కలుద్దాం" అని బయల్దేరాడు.

పెళ్లి చూపులు జరిపించాడు పేగయ్య,

అబ్బాయినీ, అమ్మాయినీ ఇద్దరినీ డాబా మీదకు పంపి, ఏకాంతంగా మాట్లాడుకోమన్నారు. కాస్సేపటికి ఇద్దరూ దిగి వచ్చారు.

"మేం పెళ్లిచేసుకోవడానికి అంగీకరిస్తున్నాం" అన్నారు ఇద్దరూ ఒక్కసారిగా -

"శుభస్య శీఘ్రం" అన్నాడు పేరయ్య

"ఇహ, ఇచ్చిపుచ్చుకోడాలు" అన్నారు, కన్యాదాత.

ఆ మాటలు విన్న ఆమె - (పెళ్లి కొడుకు తల్లి) -

"అన్నయ్యగారూ! నేను నలుగురు ఆడపిల్లల పెళ్లిళ్లు చేశాను. ఏ ఒక్కటీ నేను అనుకున్నట్టు చేయలేక పోయాను" అంది.

"దాందేవుంది - చెప్పండి, మీరెలా చెబితే అలాగే - ఖర్చుకి వెనకాడే మనుషులు కాదు - వీరు-" అన్నాడు పేరయ్య,

"వారు వెనకాడక పోవచ్చు. నేను వెనకాడతాను" అంది ఆమె.

అంతా నిర్ఘాంత పోయి చూశారు ఆమె వంక.

"అనవసరమైన ఖర్చులు వద్దు - గుడిలో చాలా సింపుల్‌గా పెళ్ళి చేద్దాం. ఏదన్నా హొటల్‌లో 'వధూవరుల పరిచయం' అని చెప్పి, బంధువుల్నీ, స్నేహితుల్ని పిలిచి, విందు ఇద్దాం" అంది ఆమె,.


"సరే- మీ ఇష్టం" అన్నారు కన్యాదాత, ఆయన భార్యానూ.

"ఇంకో విషయం -పెళ్లంటే - వధువు, వరుడూ వుండాలి, అమ్మాయికి అబ్బాయి ఎంత ముఖ్యమో, అబ్బాయికి అమ్మాయి కూడా అంతే ముఖ్యం"

"అంతే గదా, మరి?" అని వంతపాడాడు పేరయ్య,

"అంచేత ఖర్చుని మనం సమానంగా పంచుకోవాలి, ఎవరూ ఎవరికీ ఏమీ ఇవ్వడాలు వుండవు-" అంది ఆమె!

"అమ్మా! అమ్మా! మగపిల్లవాడి తల్లివై వుండి, నలుగురు ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేసిన తర్వాత కూడా,



మీరు ఇలా అంటున్నారంటే - నాకు నోటమాట రావడం లేదు, అమ్మాయి పెళ్లికి అయిన ఖర్చు, వడ్డీతో సహా అబ్బాయి పెళ్లితో రాబట్టుకోవాలని చూసుకుంటున్న ఈ రోజుల్లో, మీరిలా అనడం నిజంగానే - నాకు నోట మాట రావడం లేదమ్మా- నిజంగా నోటమాట రావడం లేదు - ధన్యోస్మి ధన్యోస్మి!" అని ప్రవాహంలా వస్తున్న ఆనందాశ్రువుల్ని తన శాలువాతో తుడుచుకుంటూ-

"నా ఆయువు కూడా పోసుకుని - నాలుగు కాలాల పాటు - మగపిల్లలను తల్లులకి ఆదర్శంగా వుండు తల్లీ!" అని దీవించాడు పేరయ్య.

అంతలో కాఫీలూ, ఫలహారాలూ వచ్చాయి-

అంతా సేవించారు - నవ్వుకుంటూ - ఒకర్ని ఒకరు అభినందించుకుంటూ - పేరయ్య మెల్లగా ఆ ఆనందాబ్ధిలోంచి పైకి తేలాడు,

"అమ్మా! నాదో చిన్నకోరిక -" అన్నాడు.

"చెప్పండి-" అంది ఆమె,

"నాకు మగపిల్లాడు కావాలి - కావాలి - అనుకున్న ఆ తండ్రి, అబ్బాయి పుట్టగానే ఇంటికి దూరవయ్యారు, అది ఖర్మ అనండి - మరేమన్నా అనండి, వారిని నేను ఓ సారి కలిసి, ఈ శుభవార్త వారికి చెప్పాలని వుంది - మీకు అభ్యంతరం లేక పోతే" అన్నాడు పేరయ్య చాలా వినయ పూర్వకంగా -

"చెప్పండి - నా కెందుకు అభ్యంతరం? నా కథ వారినోట కూడా వినండి" అని ఆయన చిరునామా చెప్పింది.

పేరయ్య ఆ చిరునామాకు వెళ్లగా, ఆయన లేరని తెల్సింది, మరో చిరునామా ఇచ్చారు, అలా తిరగ్గా, తిరగ్గా చివరకు ఆయన్ని 'జీవన సంధ్య' అనే ఓ ఆశ్రమంలో కలిశాడు పేరయ్య.

"రండి బాబూ! నేను ఇక్కడ యావజ్జీవ ఖైదీగా వుంటున్నాను, నేను చేసుకున్న పాపానికి, నేనే శిక్ష విధించుకున్నాను, అబ్బాయి పుట్టిన తర్వాత, నేను ఆమెతో - 'నువ్వు భార్యగా పనికి రావన్నాను, కాని, ఈమె ఇపుడు నన్ను - 'నువ్వు భర్తగా పనికిరావు' అని వెళ్ళి పోయింది. లండన్‌లో పెద్దడాక్టర్‌తో వుంటోందిట! నేను లేవలేను కదలలేను- కుడిపక్క పక్షవాతం"

"ఎడమ పక్క పర్వాలేదాండీ?" అన్నాడు పేరయ్య,

"అవునండి - వామ పక్షం బాగానే వుందండి - ఆ భాగం నా భార్యధిగా!" అన్నాడు కళ్లవెంట నీరు కారుస్తూ-

అతని కన్నీరు తుడిచాడు పేరయ్య,

"ఇప్పుడైనా ఆమె దగ్గరకు వచ్చెయ్యండి- ఆమెలో ఆనాటి పగ, ద్వేషం లేవు - నాకు తెల్సినంత వరకూ"

"ఒద్దు బాబూ! క్షమించే మంచితనం ఆమెకువున్నా, 'క్షమాభిక్ష' పొందే అర్హత నాకు లేదు, నేను వారిని వదిలి నందుకు,నేను వాళ్లకు దూరంగా, ఇలా కుమిలి కుమిలి ఏడవాల్సిందే,! నా పాపానికి శిక్ష నేనే అనుభవించాలి-" అన్నాడు ఆయన,

"సెలవండి" అని నిస్సహాయంగా పేరయ్య లేచాడు,

ఆయన 'ఆమె' దగ్గరకువచ్చాడు,

"అమ్మా! ఎందరినో దంపతుల్ని చేసిన నేను, విడి పోయిన దంపతుల్ని కలపగలనని ఆశ పడ్డాను. కాని, నా వల్ల కాలేదమ్మా- క్షమించండి,

'వచ్చే మాఘ మాసంలోనే మీ అబ్బాయి పెళ్లి - అదే నేను చేయించే సహస్ర వివాహ మహోత్సవం- ఉగాదినాడు నాకు సన్మానం - నా డబ్బు దమ్మిడీ ఖర్చులేకుండా" అని సెలవు తీసుకున్నాడు.